# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 29-03-2026 సమయం : సాయంకాలం 6గం.10ని.లు

## ముఖ్యాంశాలు

- పశ్చిమాసియాలో అస్థిరత కారణంగా ఉత్పన్నమైన విపత్కర పరిస్థితులను సమర్ధవంతంగా ఎదుర్కొంటున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్" కార్యక్రమంలో పేర్కొన్నారు.

- అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

- రాష్ట్రంలోని పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ... ప్రభుత్వం ఈరోజు ఉత్తర్వులను జారీ చేసింది.

- బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్రలో రానున్న రెండు రోజుల పాటు ఒక మోస్తరు వర్షం కురిసే అవకాశముందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

====================

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావంతో ప్రపంచ వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ సంక్షోభం ఉత్పన్నమవుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఆకాశవాణి ద్వారా "మన్ కీ బాత్" 132వ సంచికలో ప్రధానమంత్రి ఈరోజు దేశప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. భారత ఇంధన అవసరాలకు కేంద్ర బిందువైన పశ్చిమాసియాలో అస్థిరత.. సవాలుతో కూడుకున్నదని, అయితే గత దశాబ్ద కాలంగా భారత్ నిర్మించుకున్న అంతర్జాతీయ సంబంధాలు, దేశ సామర్థ్యం ఈ విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు తోడ్పడుతున్నాయని తెలిపారు. గల్ఫ్ దేశాల్లో కోటి మందికి పైగా భారతీయులు ఉన్నారని, వారికి అండగా నిలుస్తున్న ఆయా దేశాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో రాజకీయం చేయడం తగదని విపక్షాలనుద్దేశించి వ్యాఖ్యానించారు. 140 కోట్ల ప్రజల ప్రయోజనాలకు సంబంధించిన అంశమని, అపోహలు వ్యాప్తి చేయడం దేశానికి హానికరమన్నారు. తప్పుడు ప్రచారాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. ప్రభుత్వం చేసే ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని విజ్ఞప్తి చేశారు. కోవిడ్ మహమ్మారిని ఏ విధంగా జయించామో, అదే స్ఫూర్తితో దేశం ఏకమై ముందుకు సాగితే ఈ కష్టకాలాన్ని కూడా విజయవంతంగా అధిగమిస్తామని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

====================

పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజనతో సామాన్యుల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని, సోలార్ పంపుల ద్వారా రైతుల ఖర్చులు తగ్గుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆకాశవాణి ద్వారా "మన్ కీ బాత్" కార్యక్రమంలో ఈరోజు ప్రధాని దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ... దేశంలోని అపురూపమైన రాత ప్రతులు (Manuscripts), సాంస్కృతిక సంపదను కాపాడుకునేందుకు "జ్ఞాన భారతం" సర్వేను ప్రారంభించినట్లు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవానికి 100 రోజుల సమయం ఉందని, ప్రతిరోజూ యోగా చేయాలని సూచించారు. ఆహారంలో చక్కెర వాడకాన్ని తగ్గించాలని, వంట నూనె వినియోగాన్ని 10 శాతం మేర తగ్గించుకోవడం ద్వారా ఊబకాయం, జీవనశైలి వ్యాధులకు దూరంగా ఉండవచ్చని హితవు పలికారు.

====================

ఆంధ్రప్రదేశ్ కు ఒక్కటే రాజధాని అని, అది అమరావతి అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈరోజు నిర్వహించారు. ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహానికి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. త్వరలోనే అమరావతిని రాజధానిగా గుర్తిస్తూ కేంద్రం చట్టం చేస్తుందని పేర్కొంటూ...

(వాయిస్ 22 సెకన్లు)

====================

రాష్ట్రంలోని పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ... ప్రభుత్వం ఈరోజు ఉత్తర్వులను జారీ చేసింది. కాకినాడ కలెక్టర్ షణ్మోహన్‌ను ఏపీఈడీబీ సీఈవోగా బదిలీ చేసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌ను ఏపీఐఐసీ ఎండీగా బదిలీ చేసింది. సాయికాంత్ వర్మను గుంటూరు జిల్లా కలెక్టర్‌గా.. అభిషిక్త్ కిశోర్‌ను విశాఖ జిల్లా కలెక్టర్‌గా.. హరేంధిర ప్రసాద్‌ను కాకినాడ జిల్లా కలెక్టర్‌గా.. టి.నిశాంతిని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా.. తమీమ్ అన్సారియాను పాఠశాల విద్య శాఖ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

విరామం

====================

పేదల కోసం నిర్మించిన టిడ్కో గృహాలను త్వరలోనే లబ్ధిదారులకు అందిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నెల్లూరులో ఆయన ఈరోజు మాట్లాడుతూ... ఈ గృహాలను పూర్తి చేసేందుకు 4 వేల 400 కోట్ల రూపాయలను ప్రభుత్వం వెచ్చిస్తోందన్నారు. రాష్ట్రంలోని యువతకు ఉపాధి కల్పించేందుకు విరివిగా పరిశ్రమలను తీసుకువస్తున్నామని, దేశంలోని పెట్టుబడులలో 20 శాతం రాష్ట్రానికే వస్తున్నాయని తెలిపారు.

====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ప్రజలతో పాలుపంచుకునే మన్ కీ బాత్ కార్యక్రమాన్ని పశ్చిమ గోదావరి జిల్లా ప్రజలు వీక్షించారు. తణుకు మండలం కొమరవలు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు 90 ఏళ్ల వయసులో కుటుంబ సభ్యులతో కలిసి ప్రధానమంత్రి సందేశాన్ని విన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త

పరిస్థితులలో కూడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రధానమంత్రి తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని ఆకాశవాణితో ఆయన ఈరోజు మాట్లాడుతూ...

(వాయిస్ 18 సెకన్లు)

====================

సింహాచలం క్షేత్రంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవం మరికొద్ది సేపట్లో వైభవంగా జరగనుంది. ఈ వేడుకల్లో భాగంగా స్వామివారికి రథోత్సవం, పట్టువస్త్రాల సమర్పణ, ఉత్సవ మూర్తుల కళ్యాణం జరిపిస్తారు. చైత్ర శుద్ధ ఏకాదశి వేళ ఏటా స్వామివారి కళ్యాణం నిర్వహిస్తుంటారు.

====================

ఉత్తర ఒడిశాపై ఉన్న ఉపరితల ఆవర్తనం నుండి దక్షిణ ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, అంతర కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ద్రోణి విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అదే విధంగా రాయలసీమ పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని పేర్కొంది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తాంధ్రలో రానున్న రెండు రోజుల పాటు నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వెల్లడించింది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని తెలియజేసింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు వేగముతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది.

====================

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమన్ని రేపు జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించనున్నట్లు కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు. meekosam.ap.gov.in వెబ్ సైట్ లో కూడా అర్జీలను నమోదు చేయవచ్చని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల సమస్యలను సోమవారం స్వీకరిస్తామని ఆయన పేర్కొన్నారు.

====================

====================